క్లుప్తంగా

సబియాకు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగ పరిశోధకురాలు షేక్ సబియాకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. ఇంగ్లిష్ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య కె.రత్నషీలా మణి పర్యవేక్షణలో 'కాన్వర్జేషన్ అనాలసిస్ ఆఫ్ ఆర్‌కె నారాయన్స్ సెలెక్ట్ షార్ట్ స్టోరీస్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించడంతో సబియాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వివరించారు.

టేక్ హోం రేషన్ కిట్లు అందజేత



నెహ్రూనగర్: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు ఇంటికే రేషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని, దీనిని అర్హులైన లబ్ధిదారులు తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని బాలింతలు, గర్భిణీలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుంటూ, తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహిమర్దిని, అంగన్‌వాడీ సిబ్బంది శ్రీదేవి, ప్రసన్న, రమణ, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మీ అమ్మవార్లకు అభిషేకార్చన



పాత గుంటూరు: అరండల్‌పేటలోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా కోటి కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం గోపూజ, శ్రీ చక్ర మేరుకు అభిషేకాలు అనంతరం అష్టలక్ష్మీ అమ్మవార్లకు 108 కేజీల గంధంతో విశేష అభిషేకార్చనలు నిర్వహించారు. విశేష హారతి, మంత్రపుష్పంతో అమ్మవారి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ కోటి కుంకుమార్చన ముగింపుగా బుధవారం అమ్మవార్లకు లక్ష గాజుల పూజ, శాంతి హోమం మహా పూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు.

నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

నెహ్రూనగర్: నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ గుంటూరు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్మయ్ దేవిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీస్ గ్లోబల్ ఇంపాక్ట్ – రెలవన్స్ ఆఫ్ గాంధీయన్ థాట్ ఇన్ టుడే స్ వరల్డ్ అనే అంశంపై హిందీ, ఇంగ్లిష్‌లో మాత్రమే వక్తృత్వ జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 15వ తేదీ నిర్వహించబడుతాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 18 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాలు మధ్య గలవారై, ఉమ్మడి గుంటూరు వాసులై ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయిలో నిర్వహించ పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపిక కాబడిన యువత అక్టోబర్ 2న పార్లమెంట్ హౌస్, న్యూఢిల్లీలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. వివరాల కోసం ఈ నెల 14న గుంటూరు నెహ్రూ యువ కేంద్ర కార్యాలయాన్ని, కార్యాలయ పనివేళల్లో 6303677849 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అచ్చంపేట ఎంఈఓగా అబ్దుల్ ఖుద్దూస్‌కు పోస్టింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: పల్నాడు జిల్లా అచ్చంపేట ఎంఈఓ–1గా ఎస్ఎంఎం అబ్దుల్ ఖుద్దూస్‌కు పోస్టింగ్ ఇస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. గతంలో గుంటూరు ఎంఈఓగా పని చేసిన ఖుద్దూస్‌పై శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసిన విషయం విదితమే. తాజాగా సస్పెన్షన్ ఎత్తివేసిన విద్యాశాఖాధికారులు ఆయనకు అచ్చంపేట మండల విద్యాశాఖాధికారి–1గా పోస్టింగ్ కల్పించారు.

బాలిక ఆత్మహత్య

గుంటూరుఈస్ట్: బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డినగర్ ఒకటో లైనులో నివసించే రీటా దాస్ కుమార్తె మీరాదాస్(15) పాఠశాలకు వెళ్లకుండా కూలి పనులకు వస్తానంటూ తల్లితో మారం చేసింది. పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని తల్లి మందలించింది. ఈనెల 10వ తేదీ మీరాదాస్ ఎలుకల మందు తినింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మంగళవారం మీరాదాస్ మృతిచెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో పోలింగ్ కేంద్రాల మార్పు

కమిషనర్ కీర్తి చేకూరి



వివిధ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో వివిధ కారణాలతో పోలింగ్ కేంద్రాల చిరునామా, పేరు మార్పులను రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించి అభిప్రాయాలను తెలియజేయాలని తూర్పు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్ఓ), నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. కమిషనర్ చాంబర్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్, పోలింగ్ కేంద్రాల మార్పుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం మంగళవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాలననుసరించి గుంటూరు నగరంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన నగరపాలక సంస్థ అధికారులు కొన్ని కేంద్రాల చిరునామా, మరి కొన్ని కేంద్రాల పేర్లు మార్పుకు ప్రతిపాదించారని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయా బూత్‌లను పరిశీలించి ఏమైనా మార్పులు ఉంటే అభ్యంతరాలను తెలియజేయాలని కోరారు. కొన్ని కేంద్రాలు నాడు– నేడు పనుల వలన, కొన్ని ప్రైవేట్ స్కూల్స్ కొనసాగించకపోవడం వలన కేంద్రాలను పూర్తిగా మార్పు చేస్తున్నామని వివరించారు. మరి కొన్ని కేంద్రాల పేర్లు సరి చేశామని పేర్కొన్నారు. తూర్పులో 96, పశ్చిమలో 49 పోలింగ్ కేంద్రాల లోకేషన్స్ మార్చడానికి, తూర్పులో 52, పశ్చిమలో 38 కేంద్రాల పేర్లు మార్పుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు రెండు రోజుల్లో కేంద్రాలపై అభ్యంతరాలు తెలియజేయాలని సూచించారు. అనంతరం నివేదిక జిల్లా ఎన్నికల అధికారికి పంపుతామని చెప్పారు. సమావేశంలో పశ్చిమ ఈఆర్వో, అదనపు కమిషనర్ పెద్ది రోజ, ఏఈఆర్వోలు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, కోటయ్య, సూపరింటెండెంట్లు ప్రసాద్, పద్మ, రాజకీయ పార్టీల నుంచి బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి సిహెచ్.వాసు, సీపీఎం ఖాసిం షహీద్, తెలుగుదేశం పార్టీ ఎస్.ఓంకార్ పాల్గొన్నారు.

బ్యాంకర్లు వేగంగా రుణాలు మంజూరు చేపట్టాలి

టిడ్కో గృహ లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాల మంజూరు వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం టిడ్కో లబ్ధిదారులకు రుణాల మంజూరుపై బ్యాంకర్లు, మెప్మా సీఎంఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అడవితక్కెళ్లపాడు, వెంగళాయపాలెంలో టిడ్కో గృహ సముదాయాలను కేటాయించిన లబ్ధిదారులకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపి రుణాలు మంజూరు వేగంగా చేయాలని కోరారు. కొంత మంది లబ్ధిదారులకు సాంకేతిక కారణాలతో రుణాల మంజూరు నిలిపివేశారని, అటువంటి వారికి కూడా పునః పరిశీలన చేసి రుణాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం త్వరలో టిడ్కో ఇళ్ల ప్రారంభం చేయనున్నదని, మెప్మా సిఎంఎంలు ప్రతి లబ్ధిదారుల నుండి రుణాల కోసం డాక్యుమెంట్స్‌ని సేకరించి బ్యాంక్‌లకు అందించాలని ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిధర్ రెడ్డి, ఉపా సెల్ పి.ఓ. సాంబశివరావు పాల్గొన్నారు.

పవన్‌కు క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు

- ముందు సీఎం వైఎస్ జగన్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- లేని పక్షంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధం
- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు



లాడ్జి సెంటర్‌లోని జనసేన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

నెహ్రూనగర్: పవన్ కళ్యాణ్‌కు క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేసి జైలుకి పంపిన నేపథ్యంలో టీడీపీ శ్రేణులు సోమవారం బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో టీడీపీకి మద్దతుగా జనసేన పార్టీ నాయకులు నగరంలోని పలు వ్యాపారస్తులపై దౌర్జన్యం చేస్తూ వారి దుకాణాలను మూయించే ప్రయత్నం చేశారు. దీనిని అడ్డుకుని వ్యాపారస్తులకు మద్దతుగా నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ నిలిచి వారి దుకాణాలను తెరిపించారు. అనంతరం జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, చంద్రబాబును అరెస్ట్ చేసిన సందర్భంగా చేసిన రాద్ధాంతంపై విలేకర్లతో మాట్లాడారు. దీనిపై జనసేన నాయకులు స్పందిస్తూ మేయర్ కావటి పవన్ కళ్యాణ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో మేయర్ ఇంటిని ముట్టడిస్తామని ప్రకటించడంతో మంగళవారం మేయర్ ఇంటి వద్ద పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించాయి. మేయర్‌కు మద్దతుగా పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి, వైఎస్సార్ సీపీ శ్రేణులు అండగా నిలిచాయి. మంగళవారం ఉదయమే పార్టీ నాయకులు మేయర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని సంఘీభావం తెలిపారు.

పవన్ కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

ఈ సందర్భంగా మేయర్ కావటి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేస్తే ఆయన తనయుడు లోకేష్ స్పందించిన తీరు కన్నా పవన్ స్పందించిన తీరు గమనించదగ్గ విషయమన్నారు. పవన్ కళ్యాణ్‌ను చంద్రబాబును కలిసేందుకు ప్రత్యేక విమానంలో వచ్చేందుకు ప్రయత్నం చేయడం, పోలీసులు అడ్డుకుంటే రోడ్డుపై పడుకుని నిరసన వ్యక్తం చేయడం చూస్తే చంద్రబాబుకు పవన్ నిజంగానే దత్తపుత్రుడు అన్న మాటకు సార్థకం చేశారన్నారు. ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై జనసేన నాయకులు నన్ను క్షమాపణ చెప్పాడం హాస్యస్పదంగా ఉందన్నారు. ముందు పవన్ కళ్యాణ్ పలు బహిరంగ సభల్లో సీఎం వైఎస్ జగన్‌పై, పార్టీ శ్రేణులపై, కాపు నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు ముందు బహిరంగ క్షమాపణ చెబితే తాను క్షమాపణ చెప్పానన్నారు. లేని పక్షంలో ఎంతటి పోరాటానికై న తాను సిద్ధమేనన్నారు. ఆనాడు కాపు జాతి కోసం ముద్రగడ పద్మనాభం పోరాటం చేస్తుంటే ఆయన్ను, ఆయన కుటుంబ సభ్యులను చంద్రబాబు దారుణంగా కొట్టించినప్పుడు, అమరణ నిరాహార దీక్ష చేసినప్పుడు పరామర్శించడానికి కూడా రాని వ్యక్తి ఇప్పుడు చంద్రబాబును అరెస్ట్ చేస్తే ఎందుకు వచ్చారంటూ మండిపడ్డారు. ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ మాట్లాడుతూ వ్యాపారస్తులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు.

ఫ్యామిలీ ప్లానింగ్ విభాగం ఇన్‌చార్జిగా రామారావు



డాక్టర్ కిరణ్‌కుమార్‌కు జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న డాక్టర్ రామారావు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ కుటుంబ నియంత్రణ విభాగం ఇన్‌చార్జిగా డాక్టర్ పి.రామారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఇటీవల తనిఖీలు చేసిన సమయంలో కుటుంబ నియంత్రణ విభాగంలో ఇన్‌చార్జి లేకపోవడంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్న విషయాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు లేఖ రాయడంతో ఇన్‌చార్జి నియామకాన్ని చేపట్టారని డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. కోత, కుట్లు లేకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని, రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, డాక్టర్ గురుప్రసాద్ పాల్గొన్నారు.

రేడియాలజీ విభాగం తనిఖీ..

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ రేడియాలజీ విభాగాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. రేడియాలజీ ఓపీలో రోగులు ఎక్కువగా ఉండటాన్ని గమనించారు. ఆస్పత్రిలో రెండు స్కాన్ మిషన్‌లు నాలుగు ఎక్స్ రే మిషన్‌లు అందుబాటులో ఉన్నా రోగులు మాత్రం వందల సంఖ్యలో ఉండటంతో విధుల్లో ఉన్న వైద్య సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఒక పీజీ, ఒక రెసిడెంట్ వైద్యుడు మాత్రమే అందుబాటులో ఉన్నారని ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఎక్స్ రే రిపోర్టులు వెంటనే చూడాల్సిన బాధ్యత అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉందని తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట ఆర్ఎంఓ డాక్టర్ బత్తులవెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.

పోషకాహారం, వ్యాయామంతో వ్యాధుల నుంచి విముక్తి



గుంటూరు ఎడ్యుకేషన్: పోషకాహారం, వ్యాయామం, మంచి నడవడికతో వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చని త్రిగుణ హెల్త్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమా సుందరి పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని జీఎస్ఆర్ మోడల్ స్కూల్లో పూణేలోని జాతీయ ప్రకృతి వైద్య సంస్థ ఆధ్వర్యంలో రోగయుక్త భారత్– ప్రకృతి వైద్య ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. డాక్టర్ అమరేశ్వరరావు విద్యార్థులతో చిరు వ్యాయామం చేయించారు. అనంతరం కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేసి, విద్యార్థులకు ప్రకృతి సిద్ధమైన ఆహారాన్ని పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు జి.శివారెడ్డి, డేవిడ్ పాల్గొన్నారు.

కారు చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఎస్ఐ కారు చోరీకి గురైన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఈనెల 9వ తేదీ మహర్షియాదవ్‌నగర్‌లో నివసిచే రిజర్వు ఎస్ఐ మదన్ మోహన్ ఇంటికి తాళాలు వేసి విధులకు హాజరయ్యాడు. విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా, కారు తాళాలు, సెల్‌ఫోను, పర్సు కనిపించలేదు. బయటకు వచ్చి చూడగా కారు చోరీకి గురైనట్లు గుర్తించాడు. నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. దుర్గా నగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన 17 సంవత్సరాల బాలిక సోమవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకి కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యనారాయణపురానికి చెందిన..

గుంటూరు ఈస్ట్: మహిళ కనిపించకుండా పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సత్యనారాయణపురంకు చెందిన మహిళ భర్తతో విడిపోయి తల్లి వద్ద ఉంటుంది. తల్లితో గొడవపడి సోమవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకి కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండాపోయినట్లు నిర్ధారించుకుని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కష్టపడి పనిచేస్తే ఉపాధ్యాయులకు గుర్తింపు

డీఈఓ శైలజ



సాంబశివరావును అభినందించిన డీఈఓ శైలజ, యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. ఎల్డర్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవానంది నేషనల్ అవార్డ్స్–2023 అందుకున్న లాలుపురంలోని కాటూరి పబ్లిక్ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు చివుకుల సాంబశివరావును తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. డీఈఓ శైలజ మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సాంబశివరావు విజ్ఞానంతో వినోద కార్యక్రమాల ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో లక్షన్నర మంది విద్యార్థులకు మాథ్స్, సైన్స్, ఎలక్ట్రానిక్స్ ప్రయోగాలపై శిక్షణ అందించి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాటూరి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, జీవీఆర్ పాల్గొన్నారు.

దువ్వూరి రామిరెడ్డికి ఘన నివాళి



మాట్లాడుతున్న సాహితీవేత్త, అధ్యాపకుడు కె.జయకుమార్, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: తొలి తరం అభ్యుదయ కవి దువ్వూరి రామిరెడ్డి అని సాహితీవేత్త, అధ్యాపకుడు కె.జయకుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కవి దువ్వూరి రామిరెడ్డి వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కవిత్వం అంటే ఏమిటి అనే దానికి దువ్వూరి సాహిత్యమే చిరునామా అన్నారు. ఆయన కవిత్వపు రహస్యాలను పుట్టినిల్లుగా పేర్కొందన్నారు. సంగీత విద్వాంసుడు వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడారు. జీ 20 దేశాధినేత సదస్సు అంతర్జాతీయంగా దేశ ప్రతిష్టను మరింతం పాల్గొన్న మేధావులు విశ్లేషకులు హర్షం వెలిబుచ్చారని విశ్రాంత ప్రిన్సిపాల్ వి ద్యావేత్త ఎస్.రవిబాబు అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య, కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆటోలపై ఆకస్మిక తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్



పరిమితికి మించి ప్రయాణికులు ఉన్న ఆటోను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ అధికారులు

పట్నంబజారు: పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలపై మంగళవారం ఆర్టీఓ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 9వ తేదీన 'ప్రయాణికుల ప్రాణాలు.. గాలిలో దీపాలు' అనే కథనానికి రవాణా శాఖ అధికారులు స్పందించారు. డీటీసీ షేక్ కరీం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. పరిమితికి మించి అధికంగా ప్రయాణికులు ఉన్న ఆటోలపై ఆరు కేసులు, ఫిట్‌నెస్, పర్మిట్ లేకుండా తిరుగుతున్నవి 2, ప్రమాదకర పరిస్థితుల్లో డ్రైవింగ్ చేస్తున్నది 1, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్నవి 4, గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్న 5 వాహనాలు కలిపి మొత్తం 18 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తే.. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా గూడ్స్ ఆటోల్లో ప్రయాణికులను తరలించకూడదని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేస్తామని, ఆటోల యాజమాన్యాలు, డ్రైవర్‌లు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవన్నారు.

జాతీయ యోగాసన పోటీల్లో రావెల విద్యార్థినుల సత్తా

- జాతీయ పోటీలకు అర్హత సాధించిన వెంకట త్రివేణి
- రాష్ట్ర స్థాయి పోటీలలో రజతం సాధించిన మొఘల్ ఖాజాబీ



విద్యార్థిని వెంకట త్రివేణిని అభినందిస్తున్న హెచ్‌ఎం నాగమణి

రావెల(తాడికొండ): రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలలో తమ పాఠశాల విద్యార్థినులు సత్తా చాటి జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని రావెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎన్‌వీ నాగమణి తెలిపారు. ఈనెల 9–10 తేదీలలో కర్నూలులో నిర్వహించిన 48వ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ చాంపియన్‌షిప్ 16–18 సంవత్సరాల విభాగంలో తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని పేరుబోయిన వెంకట త్రివేణి ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికకాగా 14–16 సంవత్సరాల విభాగంలో మరో విద్యార్థిని మొఘల్ ఖాజాబీ ఆరో స్థానంతో రజతం సాధించి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిందని తెలిపారు. కర్నూలు వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 500 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో బహుమతులు సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులలో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ఏడాదిగా తమ పాఠశాలలో యోగాసనకు పెద్దపీట వేస్తూ శిక్షకుడు కె రాకేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. నిరంతర సాధన చేస్తున్న విద్యార్థులు గతంలో పలు పోటీలలో సత్తా చాటగా నేడు జాతీయ, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి తమ పాఠశాల పేరును ఇనుమడింపజేయడం ఆనందంగా ఉందన్నారు. ఎంపికై న విద్యార్థులను హెచ్‌ఎం నాగమణితో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు భాష్యం బ్లూమ్స్



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: భాష్యం విద్యార్థులు చదువులోనే కాకుండా వారు ఎంచుకున్న రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా పెనుమలూరులో నిర్వహించిన ఫుట్‌బాల్ జట్ల ఎంపికలో పోరంకిలోని భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు హెచ్.రోహిత్, ఎస్.అభిషేక్, ఎస్.లెహర్‌కుమార్, జి.రోహిత్ కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికై నట్లు తెలిపారు. ఈనెల 14న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈసందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన రామకృష్ణ భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు పవన్‌కుమార్‌ను భా ష్యం బ్లూమ్స్ జెడ్ఈఓ వరలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ జైన్ సోనల్, వైస్ ప్రిన్సిపాల్ సరిత అభినందించారు.

పోషకాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం

ప్రత్తిపాడు: పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.వెంకటరత్నం అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా చినకోండ్రుపాడు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అత్యధిక పోషక విలువలున్న ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. ప్రీ–స్కూల్ ప్రాముఖ్యత, పోషకాహారంలో చిరుధాన్యాల పాత్రపై తల్లులకు వివరించారు. ప్రీస్కూలులో ఆట పాటల ద్వారా విద్యను నేర్పించడం జరుగుతుందన్నారు. ప్రీ ప్రైమరీ–1, ప్రీ ప్రైమరీ–2 పుస్తకాలను ప్రతిరోజూ పిల్లలతో రాయించడంతో మానసివికాసం చెందుతారని తెలిపారు.

- గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని బొర్రావారిపాలెంలో సూపర్ వైజర్ వి. అరుణ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. పోషకాహారం, పెరటి తోటల పెంపకం, ఆహారంలో ఆకుకూరల వినియోగంపై తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు కవిత, అంగన్‌వాడీ కార్యకర్త బి. శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్‌పై నుంచి పడి కార్మికుడి మృతి



గుంటూరు రూరల్: ప్రమాదవశాత్తూ స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తూ పైనుంచి జారిపడి కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సాకు చెందిన గోపాల్ ప్రధాన్(22) చౌడవరం గ్రామంలోని బలరామకృష్ణ స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడుగా చేరాడు. మిల్లులో పై ఫ్లోర్‌లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలపాలవ్వగా తోటి కార్మికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఘటనపై మృతుని తండ్రి దుర్యోదన్ ప్రధాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎట్టకేలకు దొరికిన కొండచిలువ

తాడేపల్లిరూరల్: ఎట్టకేలకు కొండచిలువను మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. కొండచిలువ ఆరు నెలలుగా కోళ్లను తినేస్తూ తప్పించుకుని తిరుగుతోంది. కార్పొరేషన్ పరిధిలోని నులకపేటలో ఉన్న బిస్మిల్లా చికెన్ సెంటర్‌కు అనుసంధానంగా కోళ్ల ఫారం ఉంది. ఆరు నెలలుగా ప్రతి రోజూ కోళ్లు మాయమౌతున్నాయి. రెండు మూడుసార్లు కొండచిలువను షాపు యజమాని నజీర్ చూసి దానిని పట్టుకునేందుకు ప్రయత్నం చేశాడు. రెండుసార్లు తప్పించుకుంది. మంగళవారం కోళ్లఫారంలోకి కొండ చిలువ రావడంతో కోళ్లు అరిచాయి. కోళ్లఫారంలోకి వెళ్లి చూడగా కోళ్లపై దాడిచేసేందుకు కొండచిలువ ప్రయత్నం చేసింది. వెంటనే నులకపేటలో పాములను పట్టుకునే ఆరోగ్యంని పిలిపించగా కొండ చిలువను పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అది పైపైకి రావడంతో స్థానికంగా ఉన్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఎట్టకేలకు ఆరోగ్యం ఆ కొండచిలువను బంధించాడు. చేపలను బంధించే ఆపాలో ఆ కొండచిలువను ఉంచగా స్థానికంగా ఉన్న యువకులు కొండచిలువను చూసేందుకు భారీగా చేరుకుని ముడి విప్పదీయడంతో ఒక్కసారిగా పైకి లేచి పరుగులు తీసింది. ఎట్టకేలకు తిరిగి ఆ కొండచిలువను బంధించి బ్రహ్మానందపురంలోని ఫారెస్ట్ ఏరియాలో వదిలిపెట్టారు.